# ఎర చేప

సుబ్బలక్ష్మి కళ్లు టప టపా ఆర్పి చూసింది. ఎత్తయిన బుగ్గల మీద ఎగురుతున్న కురులను ప్రక్కకు సర్దుకుని మళ్ళీ చూసింది.

అతను ఎర్రగా, పొడుగ్గా, హుందాగా వున్నాడు. మెల్లగా నడిచి వస్తున్నాడు.

★ ★ ★

అప్పారావ్ కళ్లెత్తి సుబ్బలక్ష్మిని సూటిగా చూశాడు. ఆమె కనురెప్పలు సిగ్గుతో క్రిందకు వాలిపోయాయి. అప్పారావ్ నడుస్తూనే ఆమెను కళ్లతో త్రాగేస్తున్నాడు. అరచేయి అంత విశాలమైన కళ్లు. కళ్ల మధ్య నుంచి క్రిందకు సూదంటు రాయి లాంటి ముక్కు. ఇంకా కొంచెం క్రింద మెరుస్తున్న పెదవులు.

వెనక కారు హారన్ మ్రోగడంతో ఉలిక్కిపడి రోడ్డు ప్రక్కకు తప్పుకుని, చకచకా నడవసాగాడు అప్పారావ్.

★ ★ ★

అతను వెళ్లిపోతున్నాడు.

తనను దాడి చేశాడు.

సుబ్బలక్ష్మి ఆత్రంగా అతన్ని చూస్తున్నది.

అతను వెళ్లిపోతున్నాడు.

వెనక్కి తిరిగి మళ్లీ అతను చూస్తాడా?

చూశాడంటే అతను, అతను, తన ఉనికిని గుర్తించినట్టే.

ఇంతకూ అసలు చూస్తాడా?

సస్పెన్సు!

సుబ్బలక్ష్మి ఆత్రంగా చూస్తున్నది.

అతని విశాలమైన భుజాల మీద వున్న తల మెల్లగా ప్రక్కకు తిరిగింది.

అతను ఆగాడు.

వెనక్కు తిరిగాడు.

అమ్మయ్యా - చూసేశాడు.

అతను వెనక్కి తిరిగి చూశాడు.

సుబ్బలక్ష్మికి మహదానందమయింది.

★ ★ ★

అరె - ఆమె కూడా తననే చూస్తున్నది.

అప్పారావ్ కొంచెం కంగారుపడ్డాడు.

తను చూడాలని, ఆమె చూస్తున్నది - అంటే తనని ఆమె గుర్తించిందన్నమాట.

హాయ్ - స్వీట్ -

అప్పారావ్ సన్నగా నవ్వాడు.

ఆమెకు కనపడేట్టుగా -

ఆమె హృదయాన్ని తాకేట్టుగా -

ఆమె మనసులో కలకాలం యింకిపోయేలా -

★ ★ ★

అయ్యో - అతను తనని చూసి నవ్వేశాడు.

సుబ్బలక్ష్మి హృదయం సముద్ర కెరటంలా ఉవ్వెత్తున ఎగిరి పడింది.

ఎడం చేతిని గుండెల మీద వేసుకుని, కుడి చేతిని పైకెత్తి సుతారంగా అటూ, యిటూ వూపింది.

సాధ్యమైనంత అందంగా చిరునవ్వు నవ్వింది.

★ ★ ★

గాడ్ - చేయి వూపింది.

అప్పారావ్ హృదయం ఒక క్షణం "లబ్ డబ్" అనటం మానేసింది.

మానేసి వూరుకోక అప్పారావ్ మనసుని గిలిగింతలు పెట్టింది.

అప్పారావ్ కూడా చేయి పైకెత్తాడు.

చేయి సున్నితంగా అటూ యిటూ వూపాడు.

"హాయ్" అందామనుకుని వూరుకున్నాడు.

★ ★ ★

"అబ్బ - ఎంత హాయిగా వున్నాడు" అనుకుంది సుబ్బలక్ష్మి.

"అవును - ఎంత హాయిగా వుంది" అనుకున్నాడు అప్పారావ్.

★ ★ ★

నాన్న పెళ్లి చేయడు.

చేయలేడు.

రెండేళ్ల నుంచీ జీతాలివ్వని స్కూల్లో, ముప్పయి ఏళ్ల నుంచీ పని చేస్తున్నాడు నాన్న.

సుబ్బలక్ష్మి ఉబ్బిన ఎర్రటి నున్నటి బుగ్గల మీద అరిచేతులు ఆనించి ఆలోచిస్తున్నది.

ఎంతోమంది పిల్లల్ని ధైర్యంగా కనగలిగిన నాన్న (అంటే సుబ్బలక్ష్మి నాన్నే పిల్లల్ని కన్నాడని కాదు) - వాళ్లను పెంచటానికి భయపడుతున్నాడు.

భయపడి, పడి యిప్పుడు మంచాన పడ్డాడు.

మిగతా అందరూ నానా అవస్థలూ పడుతున్నారు.

అందుకే సుబ్బలక్ష్మి ఆలోచిస్తున్నది.

తను పుట్టి ఇరవై ఏడు ఏళ్లు అయింది.

రోజా గులాబీలు పూస్తున్నాయి.

మల్లెలు గుబాళిస్తున్నాయి.

చందమామ వెన్నెల విరజిమ్ముతున్నాడు.

అందుకే సుబ్బలక్ష్మి ఆలోచిస్తున్నది.

★ ★ ★

కట్నం ఖర్చు, పెళ్లి ఖర్చు తప్పుతాయి.

కుర్రోడు, ఎర్రగా , బుర్రగా, వున్నోడిలానే వున్నాడు.

దానికితోడు తనని చూసి చల్లగా నవ్వాడు కూడాను.

ఈ దెబ్బతో నాన్న కన్నీటి కష్టాలూ, తన తీయటి బాధ రెండు తీరతాయి.

అందుకే సుబ్బలక్ష్మి ఆలోచిస్తున్నది.

★ ★ ★

తనకి ఉద్యోగం రాదు.

వచ్చే అవకాశాలూ లేవు.

డిగ్రీ చదువు, మూడేళ్లు పట్టినా, చదువు పూర్తయి ఆరేళ్లయింది.

అప్పారావ్ దుబ్బుగా పెరిగిన క్రాఫ్‌లో, తన పొడవైన చేతి వేళ్లు వుంచి ఆలోచిస్తున్నాడు.

ఏదో నాలుగు రాళ్లు సంపాదిస్తాడని (నిజంగా యిప్పుడలాగే వుంది అతని పరిస్థితి) వాళ్ల నాన్న, వున్న అయాదెకరాలూ తెగనమ్మి అప్పారావ్‌ను చదివించాడు.

చదివించాడు కానీ ఉద్యోగం యిప్పించలేక పోయాడు.

అంతేకాదు ఈ లోకం వదలి అదే పోత పోయాడు.

మిగతా అందరూ తన మీద పడి ఆకలి అరుపులు అరుస్తున్నారు.

అందుకే అప్పారావ్ ఆలోచిస్తున్నాడు.

తను పుట్టి ముప్పయి ఏళ్లు దాటింది.

రోజూ పిల్ల గాలి తనను గిలిగింతలు పెడుతున్నది.

ఆడపిల్లల కళ్లు కవ్విస్తున్నాయి.

నరాలు నమిలేస్తున్నాయి.

అందుకే అప్పారావ్ ఆలోచిస్తున్నాడు.

తన సరదా, సరసం తీరుతాయి.

పిల్ల కూడా బొద్దుగా, కవ్వింపుగా వుంది.

దానికితోడు తనని చూసి చిరునవ్వు నవ్వింది కూడాను.

ఈ దెబ్బతో తన శరీర బాధా, మనసులోని ఆలోచనలూ తగ్గుతాయి.

అందుకే అప్పారావ్ ఆలోచిస్తున్నాడు.

★ ★ ★

ఎర, చేపను చూసి "ఇదో వెర్రిమాలోకం" అనుకుంటుంది.

"తనని తినటానికి వచ్చి, గాలానికి తగులుకుంటుంది. ఒక ఆలోచనా లేదు, పాడూ లేదూ" అనుకుంటుంది ఎర.

చేప ఎరను చూసి "ఇదో పిచ్చిమాలోకం" అనుకుంటుంది.

"కందలకుండా గాలానికి తగులుకుని, నా వేపే చూస్తున్నది. దీన్ని తినేసి కడుపు నింపుకోవాలి" అనుకుంటుంది చేప.

అప్పారావ్‌ని అలవోకగా చూసి హరివిల్లులా నవ్వింది సుబ్బలక్ష్మి.

సుబ్బలక్ష్మిని వాడిగా చూసి వేడిగా నవ్వాడు అప్పారావ్.